ప్రజాశక్తి
శుక్రవారం 24 మే 2024 | 5 | అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

వర్షాలపై అప్రమత్తంగా ఉందాం


కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాబోయే మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. వర్షాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గురువారం స్థానిక కలెక్టరేట్లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు వర్షాలు వస్తున్నవేళ ప్రజలను అప్రమత్తం చేసే చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, వాగులు, వంకల్లో నీటి ప్రవాహ స్థాయిలను తెలపాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో వరి, మొక్కజొన్న పంటలు కోత సమయంలో ఉండడంతో నీరు నిల్వ ఉంచకుండా రైతాంగం చూసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లను అందించాలన్నారు. ఆర్టీసీ బస్సులు కల్వర్టులు, కాజ్వేలలో వెళ్లకుండా డ్రైవర్ లకు అవగాహన కల్పించాలన్నారు. భారీ వర్షం వల్ల విద్యుత్ స్తంభాలు పడిపోతే త్వరితగతిన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ఒక టీం ఏర్పాటు చేసి ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నీటి ప్రవాహం ఎక్కువైనప్పుడు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే అవకాశం ఉందని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు రాణిసుస్మిత, వి.శ్రీనివాసులు రెడ్డి, జి.వెంకటేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టపాసుల తయారీ, అమ్మకం నిషేధం

సాధారణ ఎన్నికలు - 2024 నేపథ్యంలో జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు జూన్ 6వ తేదీ వరకు టపాసుల తయారీ, అమ్మకం, కొనుగోలు, వినియోగం, రవాణాపై నిషేధం విధిస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్, ప్రకటనలో గెలుపొందిన అభ్యర్థులు వారి మద్దతుగా విజయోత్సవాలు నిర్వహించే క్రమంలో బాణాసంచా కాల్చడం వాటివల్ల తలెత్తే వివిధ పరిణామాలను దష్టిలో ఉంచుకొని టపాసులపై నిషేధం విధించినట్లు తెలియజేశారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పోలింగ్ మరుసటి రోజు తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి. వైసిపి మద్దతుదారులు (ఫైల్‌ఫోటో)

◆ ముఖ్య నేతలంతా దూర ప్రాంతాలకు
◆ ఫలితాల అనంతరం ఘర్షణ లేకుండా నిఘా
◆ ఎప్పటికప్పుడు పరిస్థితులపై ఆరా..!

సిట్ ఏమి తేలుస్తుందో..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల రోజు, ఆ తరువాత వరుసగా తాడిపత్రి పట్టణంలో జరిగిన ఘర్షణపై ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఏమి తేలుస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణపై రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రిలోనే అత్యధిక మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో ఇప్పటికి వంద మంది వరకు అరెస్టు అయినప్పటికీ ఇంకా చాలా మంది అరెస్టు అవ్వలేదు. అరెస్టు చేసే అవకాశముందని భావించి ముఖ్య నేతలంతా అటు వైసిపి, ఇటు టిడిపి లకు సంబంధించిన వారందరూ ఇతర ప్రాంతాలకెళ్లి తలదాచుకుంటున్నారు. ఇంకోవైపు సిట్ బృందం రెండో దఫా విచారణను చేపట్టింది. మొదట విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను డిజిపికి అందించింది. పూర్తి స్థాయి విచారణకు సమయం కావాలని కోరడంతో ఆ సమయమివ్వడంతో మరోమారు ఇక్కడికొచ్చి మొత్తం రికార్డుల పరిశీలనతోపాటు, ఎన్నికల రోజు ఏమి జరిగిందన్న పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తోంది. పోలీసు అధికారులు, నిఘా సిబ్బంది ఏ మేరకు అప్రమత్తంగానున్నారన్న వివరాలు కూడా సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఘర్షణను ముందస్తుగా గుర్తించి నియంత్రించడంలో ఎక్కడ వైఫల్యంజరిగిందన్నది నిర్దిష్టంగా గుర్తించి బాధ్యులను తేల్చే పని కూడా సిట్ చేయాల్సి ఉంది. ఆ పనిని ఇప్పుడు సిట్ చేపట్టినట్టు తెలుస్తోంది. పూర్తి స్థాయి విచారణలో ఏమి తేల్చనుందన్నది చూడాల్సి ఉంది.



తాడిపత్రిలో రాళ్లు రువ్వుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిట్ అధికారులు (ఫైల్ ఫోటో)

ఫలితాల అనంతర పరిణామాలపైనా దృష్టి

సిట్ విచారణ ఒకవైపు కొనసాగుతుండగా ఫలితాల అనంతర పరిణామాలపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో జరిగిన వైఫల్యాలను గుర్తుంచుకుని రాబోయే పరిణామాలను ఇప్పటి నుంచి అంచనా వేస్తున్నారు. ఈ మేరకు నిఘా విభాగం ద్వారా సమాచార సేకరణను చేపడుతున్నారు. ఒక్క తాడిపత్రిలోనే కాకుండా ఇతర నియోజకవర్గాలపైనా దృష్టి సారించారు. సమస్యాత్మకంగా ఉన్న నేతలు, వ్యక్తులను గుర్తించి వారిని ఏ రకంగా కట్టడి చేయాలన్నది చూస్తున్నారు. సమస్యాత్మకం అనుకున్న వ్యక్తులను ఇప్పటికే జిల్లా బహిష్కరణలు సైతం కలెక్టర్ చేశారు. మరికొందరిపై ఇప్పటికే నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. షాడో పార్టీలు ఏర్పాటు చేశారు. ఏ మాత్రం అలజడి చెలరేగినా వెంటనే చర్యలుండే విధంగా సమయత్తం అవుతున్నారు. తాడిపత్రిలో జరిగిన ఘటనలో ఇప్పటికే పోలీసు అధికారులు కొంతమంది న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో మరోమారు ఇటువంటి చోటు చేసుకోకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ గౌతమిశాలి కింది స్థాయి అధికార యంత్రాంగం అప్రమత్తతపైనా దృష్టి సారించారు. అర్ధరాత్రి సమయాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ, ఆ తరువాత ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉండే విధంగా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి విత్తనవేరుశనగ పంపిణీ

◆ 40,704 మంది రైతుల రిజిస్ట్రేషన్ ◆ జెడిఎ యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ కాయలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు శుక్రవారం నుంచి స్థానిక రైతు భరోసా కేంద్రాలు ద్వారా విత్తనకాయలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ గురువారం తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ కోసం 47,704 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. అన్ని ఆర్‌బికె కేంద్రాల్లో వేరుశనగ కాయలు నిల్వ ఉంచామన్నారు. శుక్రవారం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు.

'దుర్గం'లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు..!

◆ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల భాగస్వామ్యం
◆ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న రియల్టర్లు
◆ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో నలువైపులా అక్రమలేఅవుట్లు విచ్చలవిడిగా ఏర్పాటు అవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నప్పటికీ రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు భాగస్వామ్యంగా మారి ఈ లేఅవుట్లు వేస్తుండడం గమనార్హం. ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల నిర్వహణ కోసం ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చారు. దీంతో వీరంతా ఎక్కువగా ఎన్నికల విధులపైనే దృష్టి సారించారు. ఇక కిందిస్థాయి ఉద్యోగులకు అన్నీ తెలిసినప్పటికీ వారు అక్రమ లేఅవుట్ల గురించి పట్టించుకోవడం లేదు.

రాయదుర్గం పట్టణంలోని అనంతపురం ప్రధాన రోడ్డుకు సమీపంలో, కణేకల్ రోడ్డు, బిటిపి రోడ్డు, బళ్లారి రోడ్, గౌడా లేఅవుట్, గొల్లపల్లి రోడ్డు పరిసర ప్రాంతాల్లో అనధికారిక లేఅవుట్లను వేశారు. కొంతమంది అధికారులకు ముడుపులు ముట్టజెప్పి రియల్టర్లు వీటిని వేస్తున్నారు. నిబంధనలను గాలికొదిలేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. లేఅవుట్లు వేసే సమయంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ ఇచ్చే భూ విలువ ఆధారంగా లెక్కగట్టి అందులో ఐదు శాతం మొత్తం రెవెన్యూకు చెల్లించాల్సి ఉంటుంది. మొదటగా వ్యవసాయతర భూమిగా మార్చుకున్నాక పురపాలక శాఖ నిబంధనలను అనుసరించి రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, ఎకరా స్థలంకు 10 సెంట్లు చొప్పున సామాజిక అవసరాలకు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలేవీ పాటించకుండా రాయదుర్గంలో రియల్టర్లు లేఅవుట్లు వేసి ప్లాట్లను వేసి విక్రయిస్తున్నారు. అప్రూవల్ లేఅవుట్ అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి బ్యాంకుల్లో రుణం లభిస్తుంది. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇలాంటి వెసులుబాటు ఉండదు. దీంతో పాటు ఇల్లు నిర్మించాలంటే పురపాలక శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసినప్పుడు అక్రమ లేఅవుట్‌గా గుర్తించి దానిని క్రమబద్ధీకరించేదుకు ఛార్జీల రూపేణా అదనపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు పరోక్షంగా ఇలా కూడా నష్టపోతున్నారు. రాయదుర్గం పట్టణంలోని డ్వామా కార్యాలయం వెనుక సర్వేనెంబర్ 323లో 3.14 ఎకరాలు, 325లో 2.89 ఎకరాల్లో మొత్తం 6.03 ఎకరాల విస్తీర్ణంలో వందకు పైగా ప్లాట్లు వేశారు. లేఅవుట్లో తారు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఏ శాఖ నుంచి కూడా అనుమతి తీసుకోనట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున బహిరంగంగా లేఅవుట్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. ఈ లేఅవుట్ వేసే సమయంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోలేదని పట్టణ వీఆర్వో ఉమేష్ తెలిపారు. పట్టణంలో నుంచి గౌడా లేఅవుట్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సర్వేనెంబర్ 159లో 3.26, 160డి1ఎలో 3.93 ఎకరాలు ఉండగా ఇప్పటిదాకా వ్యవసాయేతర భూమిగా మార్చుకోలేదు. అనంతపురం ప్రధాన రహదారి రైల్వే గేట్ పక్కనే మరో లేఅవుట్‌ను రియల్టర్లు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ కూడా వ్యవసాయభూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోకుండానే స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు వేస్తున్నారు. వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు మరో ఎత్తుగడవేస్తున్నారు. కొనుగోలు చేసిన భూమిని వారిపేరుపై మార్చుకోకుండా భూ యజమానుల ద్వారానే ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో సబ్ రిజిస్టర్ శాఖ పలు రకాలుగా ఆదాయం కోల్పోతోంది. పట్టణంలోని డ్వామా కార్యాలయం వెనుక, బళ్లారి రోడ్డులోని నరసింహస్వామి ఆర్చ్ సమీపంలో వేసిన లేఅవుట్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు సంబంధించినవి కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు వీటి గురించి పట్టించుకోకపోవడంతో రియల్టర్లు ఇష్టారీతిన నిబంధనలను తుంగలో తొక్కి లేఅవుట్లను వేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో ఇబ్బందులు పడే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖల అధికారులు దృష్టి సారించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాయదుర్గంలో డ్వామా కార్యాలయం వెనుక వేసిన అక్రమ లేఅవుట్

రెడ్డిపల్లిలో చీనీచెట్లు నరికివేత

◆ గతంలోనూ ఈ గ్రామంలో ఇలాంటి ఘటనలు ◆ పోలీసుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పండ్ల తోటలను నరికివేసే సంస్కృతి కొనసాగుతోంది. తాజాగా మహిళా రైతు వెంకటలక్ష్మమ్మకు చెందిన 189 చీనీ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నరికివేశారు. 18 నెలల వయస్సున్న మొక్కలను నరికివేశారు. గురువారం ఉదయం తోట వద్దకెళ్లిన మహిళా రైతు నరికివేసిన చెట్లను చూసి కన్నీటిపర్యవంతం అయ్యారు. కాగా ఇదే రైతుకు చెందిన మామిడి మొక్కలను గతంలో కూడా నరికివేశారు. అప్పట్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులు ఎవరనేది బయట పడలేదు. ఇదే గ్రామానికి చెందిన బాలవర్ధిరాజుకు చెందిన 300 చీనీ చెట్లు, భాస్కర్‌కు చెందిన 150 చీనీచెట్లను గతంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. ఇలా చెట్లను నరికేసే విషసంస్కృతి గ్రామంలో తరచూ కొనసాగుతుండడంతో రెడ్డిపల్లి గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చెట్లు నరికివేసిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత మహిళా రైతుతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.



వెంకటలక్ష్మమ్మ తోటలో పడిఉన్న చీనీ చెట్లు

పోలీసుల తీరుపై విమర్శలు

రెడ్డిపల్లి గ్రామంలో తరచూ పండ్ల తోటలను నరికివేస్తున్నా పోలీసులు సరిగా స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరుస ఘటనలు చోటు చేసుకున్నా పోలీసులు నిందితులను గుర్తించడంలో విఫలం అయ్యారు. ఈ నేపథ్యంలో ఒకదాని తర్వాత మరొక ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను గుర్తించి చట్టప్రకారం వారిని కఠినంగా శిక్షించాలని రెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



నరికివేసిన చీనీ మొక్క

బాధిత రైతును ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం

తాడిపత్రి రూరల్ : పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లి గ్రామంలో మహిళా రైతు వెంకటలక్ష్మమ్మకు చెందిన 189 చీనీ చెట్లను నరికి వేయడం బాధాకరమని, ప్రభుత్వం మహిళా రైతుకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు రాజారాంరెడ్డి కోరారు. గ్రామాల్లో చెట్లు నరుక్కునే సంస్కతిని విడనాడాలన్నారు. ఈ ఘటన పోలీసుల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. ఆ గ్రామంలో గతంలో కూడా ఇలా చెట్లు నరికివేసిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఆ సమయంలో నిందితులను పట్టుకుని చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ ఇలాంటివి పునరావృతం అయ్యేవి కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు.

గుత్తిలో పిచ్చికుక్క స్వైర విహారం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని టమోటా మార్కెట్, ఎస్సీ కాలనీ వీధుల్లో బుధవారం అర్ధరాత్రి పిచ్చికుక్క వీరంగం సష్టించింది. ఆరుబయట నిద్రిస్తున్న వారిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచింది. స్వైరవిహారం చేస్తున్న పిచ్చికుక్కను తరిమెందుకు వెళ్లిన వారిపై కూడా దాడి చేసింది. పిచ్చి కుక్క దాడిలో 8 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో వెంకటరాముడు, నారమ్మ పవన్, సాధిక్, ఇర్ఫాన్, బాషా తదితరులున్నారు. గాయపడిన వారికి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకలు అందించారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలకు టీకాలు వేయించి పిచ్చికుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చికుక్కదాడిలో గాయపడిన వృద్ధురాలు

పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలు

అడ్డుకున్న విద్యార్థి సంఘాలు - అనంతలో ప్రయివేటు పాఠశాల సీజ్



ప్రతిభ పాఠశాలలో అమ్మకాలు చేస్తున్న పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు, విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యామాఫియాను ప్రారంభించాయి. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. దీనిని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను విక్రయిస్తున్న నగరంలోని ప్రతిభ ప్రయివేటు పాఠశాల వద్ద గురువారం ఉదయం ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల వ్యవహరిస్తున్న తీరును జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన డిప్యూటీ డిఇఒ శ్రీనివాస రావు పాఠశాలకు చేరుకుని పరిశీలన చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న గదికి తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని చెప్పారు. పాఠశాలలను పుస్తకాలు, బట్టల షాపుల్లా మార్చేస్తున్నారన్నారు.కొన్ని పాఠశాలలో 50 శాతం ఫీజు చెల్లిస్తేనే పైతరగతిలకు అనుమతిస్తామని తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు భాష్యం, నారాయణ, చైతన్య, కేశవరెడ్డి తదితర కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి మంజు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, వంశీ, సిద్ధు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో డి3 పరిధిలోని 1,2,3,4,5 రోడ్లు, ఆర్‌కె నగర్, ఇందిరానగర్ తదితర కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు విద్యుత్ అధికారులను కోరారు. ఈ మేరకు అనంతపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్‌ను గురువారం ఆయన కార్యాలయంలో కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ డి3 పరిధిలో పనిచేస్తున్న ఎఈ, లైన్‌మెన్, ఇతర సిబ్బంది విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆప్రాంతాల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ఏఈ, విద్యుత్ శాఖ కార్యాలయానికి ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. మూడు రోజుల క్రితం అనంతపురంలో గాలి, చిన్నపాటి వర్షంతో చెట్లు కూలిపోయాయన్నారు. ఇది జరిగి మూడు రోజులు అవుతున్నా ఆ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని గత 15 రోజుల క్రితం ఎస్ఇకి వినతిపత్రం కూడా అందించామన్నారు. విద్యుత్, కార్పొరేషన్ అధికారుల మధ్య సమన్వయం కొరవడిందన్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ సమస్య లేకుండా చూడాలని కోరారు. ఈ సమస్యలపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వలీ, మసూద్, ప్రసాద్, ఎన్టీఆర్ శీన, రాజు, గఫూర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న సిపిఎం నాయకులు



గో వాహనంపై ఊరేగుతున్న పెన్నోబిలేశుడు

గో వాహనంపై దర్శనమిచ్చిన పెన్నోబిలేశుడు

వజ్రకరూరు : ఉరవకొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పెన్నోబిలేశుడు గోవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవా ల్లో భాగంగా వేకువజామున నుంచి శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శ్రీవారు మాడ వీధుల్లో ఊరేగారు. వాహన సేవ తదుపరి పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయకుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, గుండురావుస్వామి పాల్గొన్నారు.గురువారం సాయంత్రం శ్రీవారి శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనరసింహస్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

'మండల సమావేశం హాజరుతో సరి'



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ

గుంతకల్లు రూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి వాల్మీకి మాధవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ముందుగా సర్వసభ్య సమావేశం ఉందంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను పిలిపించి రిజిస్టర్‌లో అందరి చేత సంతకాలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి సమావేశాలు జరగరాదంటూ ఇందుకు సభ్యులందరూ సహకరించాలని సమావేశాన్ని ముగించారు. సమావేశాన్ని వాయిదా వేయకుండా అందరినీ పిలిచి వెనక్కు పంపడం విడ్డూరంగా ఉందంటూ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. సమావే శంలో ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, జడ్పిటిసి సభ్యులు కదిరప్ప, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు అమలు

అనంతపురం క్రైం : జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను పోలీసులు అమలు పరిచారు. బహిష్కరణకు గురైన 8 మందికి నోటీసులు అందజేసి జిల్లా హద్దులు దాటించారు. మట్కాతో పదేపదే సంబంధాలు కొనసాగిస్తున్న నలుగురిని, ఇతర రాష్ట్రాల మద్యంకు సంబంధించిన కేసుల్లో నిందితులు ఇద్దర్ని, ప్రజల్ని భయాందోళనలకు గురి చేస్తున్న మరో ఇద్దర్ని మొత్తం 8 మందిని జిల్లా ఎస్పీ గౌతమిశాలి ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఎనిమిని మందిలో ముగ్గురికి ఈ ఏడాది జులై 15 వరకు మిగితా ఐదుగురికి మూన్నెళ్ల పాటు జిల్లా బహిష్కరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కౌంటింగ్‌కు సహకరించండి : డీఎస్పీ

అనంతపురం క్రైం : కౌంటింగ్ రోజున ప్రశాంతత లోపించకుండా అందరూ సహకరించాలని అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం త్రీటౌన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో గురువారం నాడు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దష్టికి తీసికెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర సిఐలు రెడ్డెప్ప, ప్రతాప్ రెడ్డి, నారాయణరెడ్డి, ఎస్ఐ గోపాలుడు పాల్గొన్నారు.

రేపు పివికెకెలో పాలిసెట్ వెబ్ కౌన్సిలింగ్‌పై సదస్సు

అనంతపురం : నగర శివారులో ఆలమూరు రోడ్డులో ఉన్న పివికెకె ఐటి డిప్లొమా కళాశాలలో ఈ నెల 25వ తేదీ పాలిసెట్-2024 వెబ్ కౌన్సిలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిఎన్ఎస్ వైభవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9-30 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభమవుతుందని, విద్యార్థుల కోసం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు కాలేజీ బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు నంబర్స్ : 98484 71460, 88866 21124ను సంప్రదించాలన్నారు.

జెఎన్‌టియు బీ టెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో మే నెలలో నిర్వహించిన బీ టెక్ నాల్గో సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య బి.చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం JNTUA వెబ్‌సైట్ www.jntua.ac.in ను సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

వజ్రకరూరు : ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్‌కె గవర్నమెంట్ హైస్కూల్, జడ్పీహెచ్ఎస్ సెంట్రల్ హైస్కూల్, జడ్పీ హెచ్ఎస్ గర్ల్స్, శ్రీవివేకానంద, ఎవిఆర్, శ్రీమహేశ్వరి, ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఇఒ తెలిపారు.

బాలికలకు చదువు తప్పనిసరి

ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-నార్పల

ప్రతి తల్లిదండ్రులు బాలికలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని ఐసిడిఎస్ పిడి శ్రీదేవి సూచించారు. నార్పల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన కిశోర బాలికల మాసిక మహోత్సవ వేడుకలకు పిడి శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చన్నారు. నెలసరి సమయంలో శక్తినిచ్చే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ స్నానం చేయాలని శుభ్రమైన శానిటరీ ప్యాడ్స్ ధరించడంతో పాటు క్రమం తప్పకుండా మార్చుకోవాలని తెలిపారు. నడక, యోగా, వ్యాయామం చేయడం వల్ల చురుగ్గా ఆరోగ్యకరంగా ఉంటామని తెలిపారు. బాలికలు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ భారతి, బొందలవాడ సెక్టార్ సూపర్‌వైజర్ మధుమాలిని, గొల్లపల్లి అంగనవాడీ కార్యకర్త సునీత, హెల్పర్ దేవక్క, ఆశావర్కర్ అంజలికుమారి, బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తాడిపత్రి రూరల్ : బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి సూచించారు. రూరల్ మండల పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీ ఐదవ అంగన్వాడీ కేంద్రంలో గురువారం కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు, విద్యార్థినులు(కౌమార దశ బాలికలకు) రుతుస్రావం, రుతుచక్రం సమయాల్లో తీసుకోవాల్సిన పరిశుభ్రతపై సూపర్‌వైజర్ వివరించారు. అలాగే బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, తదితర వాటిపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సునీత పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి శ్రీదేవి

'వరదహస్తం' కథలసంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాంతియుతమైన చక్కని సమాజం ఏర్పడాలనే కోరికతో, అనంత రచయిత్రి గండ్లూరి పంకజమ్మ రాసిన "వరద హస్తం" కథల సంపుటిని గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆవిష్కరించారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. పంకజమ్మ రాసిన కథలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన కథలని తెలియజేశారు. సీనియర్ రచయిత్రి జి.నిర్మలారాణి వరద హస్తంలోని కథలను వివరించారు. మధ్యతరగతి జీవితంలో మనుషుల తీరుతెన్నులు, సమాజ పోకడలను యథాతథంగా పంకజమ్మ చిత్రీకరించారని విశిష్ట అతిథిగా పాల్గొన్న డా॥కోడూరి విష్ణునందన్ అభిప్రాయపడ్డారు. విశిష్ట అతిథి, ప్రముఖ విమర్శకులు రాజారామ్ మాట్లాడుతూ మంచి ఎత్తుగడ, మంచి కొనసాగింపు, మంచి ముగింపు, సజీవ పాత్రలతో నిండిన ఈ కథలకు శిల్ప చాతుర్యం తోడైతే మరింత గొప్ప కథలుగా రాణించేవి అని సూచనప్రాయంగా తెలియజేశారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన జి.యమునారాణి, జి.పేరిందేవి ఈ కథలన్నిటినిండా మహిళా ఔన్నత్యం చిత్రీకరింపబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా॥పి.శ్రీదేవి, టివి.రెడ్డి, అశ్వర్థ రెడ్డి, ఎ.ఎ.నాగేంద్ర, శేషాచార్యులు, అమరనాథరెడ్డి, షేక్ నబీరసూల్, జయసింహ, జెట్టి జయరాం, గోవిందరాజులు, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, షరీఫ్, మురళి, రియాజుద్దీన్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



గండ్లూరి పంకజమ్మ వరదహస్తం కథలసంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

50వ సారి రక్తదానం

అనంతపురం : నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ 50వ సారి రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. రమేష్ గురువారం హైదరాబాద్ లోని 'చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్'లో 50వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. మెగాస్టార్ చిరంజీవి గొప్ప ఆశయంతో 1998 అక్టోబర్ 2వ తేదీ 'చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్' స్థాపించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నాతో సహ ఎంతోమంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారని తెలిపారు. ప్రమాద బాధితులు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నిరంతరం రక్తం అవసరమని, అలాంటి వారికి రక్తం కొరత లేకుండా ప్రతి 3 నెలలకూ ఓ సారి యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.



రక్తదానం చేస్తున్న సుంకర రమేష్

రెడ్డిపల్లిలో పోలీసుల గ్రామసభ

పెద్దపప్పూరు : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఎస్ఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఇటీవల కాలంలో రెడ్డిపల్లి గ్రామంలో రైతుల పొలాల్లో చెట్లు నరికివేసిన సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. అందరూ రైతులే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం తగదని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో జీవించాలని, రైతులకు జీవనాధారమైన చెట్లు నరికి వేయడం ఏమాత్రం తగదన్నారు. మీరు, మీ భవిష్యత్తు బాగుండాలంటే ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వారి సమాచారం ఇవ్వాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున, ఫలితాల అనంతరం ఎలాంటి సమస్యలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఆయనతో పాటు ఏఎస్ఐ మహదేవన్, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా వెంకటరమణ స్వామి కల్యాణోత్సవం

శింగనమల : స్థానిక గోల్కొండ మీద వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణ స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసంలో మొదటి పున్నమికి ముందు రోజు రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం, మరుసటి రోజు స్వామివారి మడుగు తేరు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. తాజా మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి : సిఐ

పుట్లూరు : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి సూచించారు. సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో పోలీసులు పర్యటించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అలాకాకుండా గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం ఎవరూ ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా టపాసుల పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, గుంపులుగా చేరడం లాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై చర్యలు చేపడతామని తెలిపారు.

ఓబుళాపురంలో నాకాబంది

మండలంలోని ఓబుళాపురంలో తెల్లవారుజామున పుట్లూరు సిఐ సుబ్రహ్మ ణ్యం, ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అలాగే గ్రామంలో గతంలో నేర చరిత్ర, కేసులు ఉన్న వారి ఇళ్లలో సోదాలు చేశారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం ప్రజలు ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకూడదని కౌన్సెలింగ్ ఇచ్చారు.

టిడిపి కార్యకర్తకు 'ఆలం' పరామర్శ

నార్పల : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మండలంలోని రంగాపురం గ్రామంలో టిడిపి తరఫున మనోజ్(జగన్) ఏజెంట్‌గా కూర్చున్నాడు. అతడు ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో కాలు విరిగింది. దీంతో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు బెంగళూరులోని ఆ హాస్పిటల్‌కు వెళ్లి మనోజన్నఉ పరామర్శించారు. తన వంతుగా సాయం చేస్తానని, పార్టీ తరపున న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలం వెంట మనోజ్ సోదరుడు కరుణాకర్, ప్రతాప్ ఉన్నారు.

శేష వాహనంపై విహరించిన వెంకటరమణస్వామి



శేష వాహనంపై దర్శనమిస్తున్న వెంకటరమణస్వామి

రాయదుర్గం : పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి శేష వాహనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి కోటలోని వెంకటరమణస్వామి ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో రాయదుర్గం కుర్నిశెట్టి శాలీయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక భర్తను కడతేర్చిన భార్య

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్



హత్యకు గురైన శ్రీనివాసులు

వేధింపులు తాళలేక కట్టుకున్న భర్తను భార్యే హతమార్చిన సంఘటన బుధవారం రాత్రి గుంత కల్లు పట్టణ శివారులోని కొనకొండ్ల రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు(52), అతడి భార్య సరస్వతి తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసులు కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసై పండ్ల వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బు మొత్తాన్ని తాగుడుకు ఖర్చు చేసేవాడు. ప్రతి రోజూ అతి గా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యపై నిందలు కట్టడం, కొట్టడం చేసేవాడు. రోజూ లాగానే బుధవారం అతిగా మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడ్డాడు. అతడి వేధింపులు భరించలేక భార్య సరస్వతి కర్రతో అతడి తలపై దాడి చేసింది. అనంతరం చెప్పుకాలితో గొంతుపై నొక్కి హతమార్చింది. ఆ తర్వాత తనకు ఏమీ తెలియదన్నట్లు మృతుడి తండ్రి వద్దకు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తులెవరో కొట్టి ఇంటిముందు పడేసి వెళ్లారని బోరున విలపించింది. అనుమానం వచ్చిన మృతుడి తండ్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో భర్తను తానే హత మార్చినట్లు ఒప్పుకొంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ టౌన్‌బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : జీవితంపై విరక్తితో అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి రైలు కింద పడి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు... తాడిపత్రి పట్టణానికి చెందిన దద్దం శ్రీనివాసరావు(62) టౌన్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేశారు. గతంలో ఈయన చెన్నైలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగాయి. గాయపడిన ఈయన కోలుకునేందుకు చాలా కాలం పట్టింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తితో ఉండేవాడు. కర్నూలులోని ఓ సైక్రియాటిస్ట్ వద్ద చికిత్స తీసుకుంటుండేవాడు. బుధవారం రాత్రి జీవితంపై విరక్తితో తాడిపత్రి సమీపంలోని ఆటోనగర్ రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని వద్ద ఉన్న గుర్తింపు కార్డులతో ఆయన్ను శ్రీనివాసరావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మతుడికి భార్య విజయలక్ష్మి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి

బొమ్మనహాల్ : మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన రైతు బోయ శ్రీరాములు(48) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే రాయదుర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆ గ్రామం వెళ్లి రైతు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలవ వెంట టిడిపి నాయకులు అప్పారావు, గ్యాస్ గోవిందు, బలరామిరెడ్డి, గోనెహాల్ కేశవరెడ్డి తదితరులు ఉన్నారు.

వైసిపి నేత మృతికి సంతాపం



హనుమంతరాయుడు మృతికి సంతాపం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

బెళుగుప్ప : మండలంలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ఎన్. హనుమంత రాయుడు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దుద్దేకుంట గ్రామం వెళ్లి హనుమంతరాయుడు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వ మాట్లాడుతూ హనుమంతరాయుడు పార్టీ కోసం ఎనలేని సేవలు చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తి మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య సాకమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశ్వ వెంట బిసి జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి పెద్దన్న, రాకెట్ల అశోక్, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన డైరెక్టర్ రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు బి.శివలింగప్ప, పాతన్న, దేవారెడ్డి, కృప హనుమంతరాయుడు, ఎర్రిస్వామి ఉన్నారు.

పది మంది బైండోవర్

పుట్లూరు : జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటన లు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం తహశీల్దార్ మల్లికార్జునస్వామి ఎదుట పది మందిని హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పెట్రోల్, డీజిల్ లూజ్‌గా అమ్మొద్దు

నార్పల : ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ మండల వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల ట్యాంకుల్లో మాత్రమే పెట్రోల్, డీజిల్ నింపాలని, విడిగా బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ నింపకూడదని ఎంపిడిఒ రాముడు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పెట్రోల్ బంకు యజమానులను హెచ్చరించారు. అలాగే పెట్రోల్ బంకుల్లో తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, వాహన టైర్లకు ఉచితంగా గాలి ఏర్పాటు చేయాలని, వాటిపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్ర మంలో ఇఒఆర్‌డి శైలజరాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జ్యోతిరాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

గొర్రెలకాపరులకు పశువైద్యాధికారి రమేష్ సూచన

ప్రజాశక్తి-బెళుగుప్ప

తొలకరి వర్షాలు కురిసినప్పుడు జీవాలకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఎ.రమేష్ గొర్రెల కాపరులకు సూచించారు. గొర్రెలు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులపై గురువారం మండలంలోని ఎలగలవంకతండాలో గొర్రెల కాపరులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. పశువైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ సాధారణంగా తొలకరి వర్షాలు వచ్చినప్పుడు కొత్త గడ్డి మొలక వస్తుందని, దీంతో జీవాలకు చిటిక వ్యాధి వచ్చి గొర్రెలు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకుండానే మృత్యువాత పడతాయన్నారు. తద్వారా గొర్రెల యజమానులకు భారీ నష్టం ఏర్పడుతుందన్నారు. కావున గొర్రెలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు. ప్రధానంగా ఎక్కడైనా జీవాల మరణాలు సంభవిస్తే వెంటనే మీ ఆర్‌బికె పరిధిలో ఉన్న పశుసంవర్ధక శాఖ సహాయకులకు గానీ, పశు వైద్యాధికారికి గాని సమాచారం ఇస్తే వెంటనే మీకు వైద్యం అందుబాటులోకి తెచ్చి నివారణ చర్యలు కూడా చేపడతామన్నారు. ప్రస్తుతం చిటిక వ్యాధి నివారణ టీకాలు అందుబా టులో ఉన్నాయని, రైతులు, గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు, రైతులు పాల్గొన్నారు.



గొర్రెలకు చిటిక వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

వివాదాలకు తావివ్వొద్దు : సిఐ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావివ్వరాదని రాయదుర్గం అర్బన్ సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం సిఐ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని మెచ్చిరి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే రౌడీషీటర్లు, పాత కేసుల్లోని నేరస్తుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. పశువుల పాకలు, గడ్డివాముల్లో సోదాలు చేశారు. ఎవరైనా ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రికార్డులు లేని 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి, కాలనీల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మనహాల్, కణేకల్లు ఎస్ఐలు, రాయదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.



మెచ్చిరి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు:ఎస్ఐ

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరైనా ఎంతటివారైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం గ్రామాల్లో సమస్యలు ఎలాంటి గొడవలు జరిగినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. టపాసులు, తదితర సామగ్రి వంటివి పేలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మీరు చేసే పనులు మీ పిల్లల భవిష్యత్తును దెబ్బతిస్తాయని, మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలంటే గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చంద్రమౌళి

ప్రజాశక్తి-వజ్రకరూరు

తుఫాను విపత్తు నిర్వహణపై మండల, గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చంద్రమౌళి ఆదేశించారు. ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చంద్రమౌళి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉరవకొండ మండల వ్యాప్తంగా పాఠశాలల ప్రాంగణంలో చెట్లు, గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు కూలే స్థితిలో ఉంటే గుర్తించాలన్నారు.పంచాయతీ సెక్రెటరీలు డ్రెయినేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారం తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. మండల ఏఓ శుభకర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు పంటలు ఏమైనా ఉంటే గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది గుర్తించాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ, హార్టికల్చర్, వెటర్నరీ, మైనర్ ఇరిగేషన్ ఏఈ, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.



తుఫాను విపత్తు నిర్వహణపై సూచనలిస్తున్న అధికారులు

వేసవి శిక్షణ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-వజ్రకరూరు



వేసవి శిక్షణ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ ఈశ్వరప్ప

నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఇఒ ఈశ్వరప్ప బహుమతులు ప్రదానం చేశారు. ఉరవకొండ పట్టణంలోని శ్రీ షిర్డీ సాయి దేవాలయ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్ర మానికి ఎంఇఒ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 21 రోజుల పాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. సేవలందించిన 18 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు వెంకట్, గీత ప్రచార సమితి, ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం సంచాలకులు పుష్ప, లయన్స్ క్లబ్ ప్రతినిధి గణేష్‌బాబు, శ్రీ షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షులు ప్రతాప్, యుఆర్ సొసైటీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.